క్లుప్తంగా

శరన్నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తం



పందిరి రాట వేస్తున్న అర్చకుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదపూడి: ఈ నెల 12వ తేదీన జరిగే విజయదశమి, శరన్నవరాత్ర ఉత్సవాలకు సంబంధించి సంపర గ్రామంలో విజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం పందిరి రాట ముహూర్తం చేశారు. ముందుగా విఘ్నేశ్వర పూజ చేశారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి శరన్నవరాత్రులు ప్రారభమవుతాయని, అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు తెలిపారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కొంకుదురు గ్రామంలో అన్నసమారాధన



కొంకుదురు అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా మార్కెట్ సెంటర్ వద్ద అన్న సమారాధన చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చిన్నం వీరభద్రారెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో వివిధ రకాల వంటకాలతో అన్న సమారాధన చేశారు. గ్రామస్తులే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆదిత్యునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని ఆలయంలో సన్నిధిలో ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆలయంలో వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ వారు, తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బైబై గణేశా..!



రంగంపేటలో గణేశ్ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రంగంపేట: స్థానిక పాతూరు రామాలయం మంటపం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనోత్సవాలు గ్రామ మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగాయి. వినాయకుడి విగ్రహాన్ని ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఊరేగించారు. వివిధ వేషధారణలు, యువకుల సందడితో ఆనందంగా సాగింది. అనంతరం రాజమహేంద్రవరం గోదావరిలో నిమజ్జనం చేశారు. అంతకుముందు మంటపం వద్ద లడ్డూ వేలాన్ని కోలాహలంగా నిర్వహించారు. లడ్డూ వేలంలో భక్తులు పోటీ పడ్డారు.

స్వర్ణాంధ్ర 2047 పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా వంద రోజుల కూటమి పాలన పనితీరుపై ప్రజలకు వివరించారు. అలాగే స్వర్ణాంధ్ర -2047 పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ సీతాపతి రావు, సర్పంచ్ వల్లు సత్యనారాయణ, ఎన్డీఏ నాయకులు పుట్టా గంగాధర్ చౌదరి, తమలంపూడి శివరామారెడ్డి, జుత్తక సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి హారం సమర్పణ

రంగంపేట: చంద్రేడులో ఉన్న శ్రీదేవి కనకదుర్గ అమ్మవారికి దాతలు హారం సమర్పించినట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన బిక్కన లక్ష్మీనారాయణ, వెంకటలక్ష్మి దంపతులు రూ.3500 విలువ గల(రోల్డు గోల్డు) హారం అందజేశారన్నారు. ప్రత్యేక పూజలు అనంతరం ఈ హారాన్ని అమ్మవారికి అలంకరిచనున్నట్టు ఆయన తెలిపారు.

కలవరి పెడుతున్న తుపాన్లు

- అధికారుల హెచ్చరికలతో ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- అధిక వర్షాలతో పంటలకు నష్టం



నరేంద్రపురంలో వెన్ను దశలో ఉన్న వరి పంట

రాజానగరం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది మొదలు పిలవకుండానే పలుకరిస్తున్న వర్షాలతో పాటు తుపాన్లు రైతన్నలను కలవరి పెడుతున్నాయి. ఆగస్టులో సంభవించిన తుపానులతో ఇప్పటికే రైతులు నష్టాలపాలయ్యారు. రెండు పర్యాయాలు వరి నాట్లు వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రేపటి నుంచి మరో తుపాను వస్తుందనే సమాచారం కర్షకులకు కునుకు లేకుండా చేస్తోంది. తుపానుల కారణంగా వేసి నాట్లు పాడై, మళ్లీ నాట్లు వేసిన పొలాలు ప్రస్తుతం దుబ్బకట్టే దశలో ఉండగా జూలైలో నాట్లు పడిన పొలాలలో వరి పంట పొట్టదశలో ఉంది. ఈ తరుణంలో తుపాను సంభవిస్తే పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాను అంటే వేగంగా గాలివేస్తూ, భారీగా వర్షాలు కురుస్తుంటాయి. వర్షం ఎంతగా కురిసినాగాని, పొట్ట దశలో ఉన్న వరి పంటకు పెద్దగా నష్టం ఉండకపోవచ్చు, కానీ అదే గాలులు విపరీతంగా వీస్తే మాత్రం వరి పంట వెనుదిరిగి ఎందుకూ పనికి రాకుండా పోతుందంటున్నారు.

అల్పపీడనం ప్రభావం ఉంటుందా ?

ప్రస్తుతం బంగాళాఖాతంలో తూర్పు-పశ్చిమ గాలి విచ్ఛిన్నతిలో కేంద్రీకృతమై, మధ్య ట్రోపోస్పిరిక్ స్థాయిల వరకు ఆవర్తనం విస్తరించి ఉందని, దీని ప్రభావంతో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ హెచ్చరికలు అన్నదాతలకు చెమటలు పట్టిస్తున్నాయి. ఈ కారణంగా సోమవారం నుంచి రాబోయే మూడు, నాలుగు రోజులపాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే ప్రకటించారు.

64,695 ఎకరాలలో వరి సాగు

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 64,695 ఎకరాలలో వరి పంటను సాగుచేస్తున్నారు. దీనిలో 8,650 ఎకరాలలో వరి పంట ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతినడంతో ఆయా రైతులు మరోసారి నాట్లు వేసుకోవాల్సి వచ్చింది. ఈ కారణంగా ప్రస్తుతం ఈ పంట దుబ్బ చేసే దశలో ఉంది. దీనికి వర్షాల వలన పెద్దగా నష్టం ఉండకపోవచ్చు. కానీ ఆగస్టుకు ముందుగానే నాట్లు పడిన 56 వేలకు పైడి ఉన్న ఎకరాలలో వరి పంటకు నష్టం వాటిల్లేందుకు అవకాశం ఉంది. అల్పపీడనం తుపానుగా మారి గాలుల తీవ్రంగా ఎక్కువగా ఉంటే పంట ఒరిగిపోతుంతుంది ఈ కారణంగా పొట్టదశలోను, ఈనిక దశలో ఉన్న పంటలో పొల్లు శాతం అధికమై, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు భయపడుతున్నారు.

గాలులు వీస్తే ప్రమాదం



మండలంలో నరేంద్రపురం, నందరాడ, కలవచర్ల, తూర్పుగానుగూడెం, వెలుగుబంద పొలాలలో చాలా మంది రైతులు త్వరితగతిన వరి పంట కోతకు వచ్చేలా ఈ ఖరీఫ్‌లో స్వల్పకాలిక వరి వంగడాలను సాగు చేశారు. ఈ రకాలు 120 నుంచి 135 రోజులలోనే కోతకు వస్తాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎక్కువగా ఈనిక దశలో వరి పొలాలు ఉన్నాయి. ఈ సమయంలో గాలులతో కూడిన భారీ వర్షాలు కురిస్తే మాత్రం ఊహించలేనంత నష్టం వాటిల్లుతుంది. గాలులకు వరి పంట నేలకు ఒరిగిపోతే ఎందుకూ పనికిరాకుండా పోతుంది. ముసులు ఎక్కువ రోజులున్నా కూడా ప్రమాదమే. గత పదేళ్లుగా ఇటువంటి పరిస్థితులు ఎదురుకాలేదు. ఈ ఏడాదే భారీ వర్షాలు అన్నదాతలను ఇబ్బంది పెడుతున్నాయి.

– ప్రగడ రాంబాబు, రైతు, నరేంద్రపురం

హిందీ ఉపాధ్యాయినికి ఉత్తమ అవార్డు



హైదరాబాద్‌లో ఉత్తమ హిందీ ఉపాధ్యాయని అవార్డు అందుకుంటున్న వెంకటలక్ష్మి

సీతానగరం: సింగవరానికి చెందిన మద్దూరి వెంకటలక్ష్మికు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఉత్తమ హిందీ ఉపాధ్యాయిని అవార్డును డాక్టర్ అమృతరావు ఎడ్యుకేషన్ సొసైటీ వారు ఆదివారం అందించారు. వెంకటలక్ష్మి హిందీ ఎంఏ పూర్తి చేసి 1995 నుంచి అనేక ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వలంటీర్‌గా పని చేశారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలో హిందీ టీచర్‌గా పని చేస్తున్నారు.

నరసన్న దేవస్థానంలో అన్నదానం

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం జరిగిన నిత్యాన్నదానికి భక్తులు రద్దీ పెరిగింది. ఆదివారం సెలువు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మధురపూడి: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా కోరుకొండ, బూరుగుపూడి గ్రామాల్లో అన్న సమారాధనలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

తోకాడలో 'ఇది మంచి ప్రభుత్వం'

రాజానగరం: తోకాడలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అసిస్టెంట్ లైన్‌మన్‌కు గాయాలు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో విద్యుత్‌శాఖ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాజానగరానికి చెందిన కనకాల అప్పారావు ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో అసిస్టెంట్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం విధులు ముగించుకుని తన స్వగ్రామం వెళ్తుండగా స్థానిక పాదాలమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అప్పారావును కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

గ్రామాభివృద్ధికి కృషి

ధవళేశ్వరం: గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ఆదివారం ధవళేశ్వరంలోని జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్, మార్ని వాసు, పట్టణ అధ్యక్షుడు పండూరి అప్పారావు ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ కవి ఎస్ఆర్ పృథ్వీకి సత్కారం



ప్రముఖకవి ఎస్ఆర్ పృథ్వీని సత్కరిస్తున్న కనకం అప్పలస్వామి కుటుంబసభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామంనకు చెందిన ప్రముఖకవి ఎస్ఆర్ పృథ్వీని ఆదివారం ఆయన నివాసంలో కనకం అప్పలస్వామి కుటుంబసభ్యులు ఘనంగా సత్కరించారు. ఎస్ఆర్ పృథ్వీ తన 41వ గ్రంథం దేవాంగమణి దీపాలు పుస్తకంలో జీవకారుణ్యసంఘం వ్యవస్థాపకులలో ఒకరు,ప్రముఖ సంఘసేవకులు కనకం అప్పలస్వామి జీవితవిశేషాలు వివరించారు. దీనికి కృతజ్ఞతగా అప్పలస్వామి కుటుంబ సభ్యులు విజయకుమార్, చంద్రశేఖర్ తదితరులు ఎస్ఆర్ పృథ్వీని శాలువా, పుష్పమాలతో సత్కరించారు. కనకం అప్పలస్వామి శతజయంతి ఉత్సవం 2025లో జరపనున్న నేపథ్యంలో వారి జీవితచరిత్ర రాయమని కుటుంబ సభ్యులు ఎస్ఆర్ పృథ్వీని కోరగా ఆయన అంగీకరించారు.

కాకినాడలో 5న పారిశుధ్య కార్మికుల సభ



కైకవోలు సెంటర్‌లో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పెదపూడి: వచ్చే నెల 5వ తేదీన కాకినాడ గాంధీభవన్‌లో జరుగు పారిశుధ్య కార్మికుల సమాఖ్య(ఏఐఎఫ్‌టీయూ అనుబంధం) సభను జయప్రదం చేయాలని ఏఐఎఫ్‌టీయు జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు కోరారు. పెదపూడి గ్రామ శివారు కైకవోలు సెంటర్లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం(ఏపీఆర్‌సీఎస్) జెండా వద్ద పారిశుధ్య ఆధ్వర్యంలో జరిగే సభ కరపత్రాన్ని ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్మికులు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సమాజ సంక్షేమం కోసం సేవలందిస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అనంతరం మండలంలోని గ్రామాల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ జిల్లా ప్రతినిధి మడికి సత్యం, పారిశుధ్య కార్మికుల సమాఖ్య నాయకుడు బొచ్చా ఏసు, ఏపీఆర్‌సీఎస్ జిల్లా నాయకులు ఎల్లే సత్తిబాబు, శ్రీను తదతరులు పాల్గొన్నారు.

నానాజీని వెంటనే అరెస్టు చేయాలి

రాజానగరం: రంగరాయ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు పై దాడి చేసి, చంపేస్తానని బెదిరించిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని, తన అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జె. సత్తిబాబు, పి. వెంకటనాయుడు డిమాండ్ చేశారు. వైద్య కళాశాలలోని క్రీడా మైదానంలో వాలీబాల్ ఆటకు అనుమతి కోసం తన అనుచరులతో వచ్చిన ఎమ్మెల్యే ప్రొఫెసర్‌పై అమానుషంగా ప్రవర్తించడం, దుర్భాలాడి అవమానించడం సిగ్గుచేటన్నారు. ఈ విషయంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ న్యాయపరంగా వ్యవహరించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

నానాజీని వెంటనే బర్తరఫ్ చేయాలి

పెదపూడి: కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల డాక్టర్ ఉమా మహేశ్వరరావుపై దుర్భాషలాడి, దాడికి పాల్పడిన కాకినాడ రూరల్ జనసేన పార్టీ ఎమ్మెల్యే పంతం నానాజీని వెంటనే బర్తరఫ్ చేయాలని పలు ప్రజాసంఘాల ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, అతని అనుచరులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి, జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ప్రతినిధులు గుబ్బల ఆదినారాయణ, గణేష్, శ్రీనివాసు, రాగుల రఘువులు డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే అనుచరులు వాలీబాల్ ఆడడానికి అనుమతి కోసం డాక్టర్ ఉమా మహేశ్వరరావుపై ఒత్తిడి తెచ్చారు. దీనిపై ఉన్నత అధికారులకు తెలియజేసే వరకు మీరు కాలేజి లోపలకు రాకూడదంటూ చెప్పడంతో డాక్టర్‌పై ఎమ్మెల్యే వీరంగం చేస్తూ బూతుపురణం వల్లించారు. కాలేజీలో స్టూడెంట్స్ ముందే డాక్టర్‌ను అవమానించిన అందరిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



మర్రిపూడిలో ఇందిరమ్మ కాలనీ వద్ద ప్రధాన కాలువలో జేసీబీతో పూడిక తీస్తున్న కార్మికులు

రంగంపేట: ప్రతి ఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అప్పుడే ఎలాంటి వ్యాధులు దరిచేరవని గ్రామ సర్పంచ్ వేము మాధవి సూచించారు. ఆదివారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో డ్రైనేజీలు, మురుగునీటి కాలువలను శుభ్రం చేయించామన్నారు. ఇందిరమ్మ కాలనీ వద్ద ప్రధాన కాలువలో జేసీబీ సహాయంతో చెత్తను తొలగించి ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించారు. పారిశుధ్య కార్మికులతో అపరిశుభ్రత ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించామన్నారు. రోడ్లకు ఇరువైపులా చెత్తా చెదారాన్ని తొలగించామన్నారు. పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించామన్నారు.

మా స్థలాన్ని కాపాడండి



కోటికేశవరం రచ్చబండ సెంటర్ సమీపంలో ఇంటి డాక్యుమెంట్లతో నిలుచున్న బాధితులు

మధురపూడి: మా స్థలాన్ని కాపాడంటూ కోటికేశవరానికి చెందిన బాధితురాలు నల్లమాటి చంటిమ్మ, ఆమె కుమార్తెలు గుడాల భారతి, నల్ల మాటి అనంతలక్ష్మి, ఇందిర వాపోయారు. తమ స్థలాన్ని తమ పెదనాన్న అయినా నల్లమాటి వెంకటేశులు ఆక్రమించాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కోరుకొండ మండలం కోటికేశవరంలో విలేకరులతో వారు వాపోయారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల సమీపంలోని 1994లో 106 మంది పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు అందించింది. దీనిలో తమ తండ్రి నల్లమటి బెన్ని(లేటు) పేరున 3 సెంట్లు స్థలాన్ని కేటాయించారు. కాగా ఆయన కుమార్తెలైన తమకు ఆ స్థలంపై హక్కులేదని, ఉమ్మడి ఆస్తి అంటూ నల్లమాటి వెంకటేశులు కుటుంబ సభ్యులు తమపై దాడులు చేసి , ఘర్షణకు దిగుతున్నారని బాధితులు చెబుతున్నారు. ఆ స్థలం ఇంటిపన్ను, కుళాయి పన్ను, కరెంట్ బిల్లులు చెల్లిస్తూ, అన్ని విధాల డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయంపై గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఆడపిల్లలకు హక్కు ఉందని చెప్పినప్పటికీ వేంకటేశులు వినకుండా ఆక్రమణకు పాల్పడుతున్నారని తెలిపారు. కోరుకొండ ఆర్ఐ హరిబాబు, స్థానిక వీఆర్వో దారా ధర్మరాజు సపోర్టుతో మమ్మల్ని వేధిస్తున్నారని తెలిపారు. దీనిపై కోరుకొండ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని బాధితులు చెబుతున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు నల్లమాటి చంటిమ్మ, గుడాల భారతి, నల్ల మాటి అనంత లక్ష్మి, ఇందిర కోరుతున్నారు.

అక్కినేని నాగేశ్వరరావుకు నివాళి



రమణను సత్కరిస్తున్న మల్లికార్జునరావు, శేషగిరిరావు తదితరలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి రామాలయం సెంటర్‌లో ఆదివారం అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అక్కినేని అభిమాని అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన అక్కినేని నాగార్జున అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాకినేని మల్లికార్జునరావు మాట్లాడుతూ మంచి వ్యక్తిత్వంతోపాటు, ఎన్నో సందేశాత్మక చిత్రాలను అందించిన ఘనత ఏఎన్ఆర్‌కు దక్కుతుందన్నారు. నాగార్జున ఫాన్స్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఆర్ అభిమాని బూరుగుపూడికి చెందిన రమణను అక్కినేని షీల్డు అందజేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఏఎన్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక



సీతానగరం విష్ణాలయంలో సమావేశమైన మండల బ్రహ్మణ సంఘం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం మండల బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం సీతానగరం విష్ణాలయంలో మండల బ్రహ్మణ సంఘం సమావేశం నిర్వహించారు. మండల సంఘం అధ్యక్షుడు చింతలూరి రంగారావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడి రంగారావు రాజీనామ చేయగా, మండల సర్వ బ్రాహ్మణ సంఘం నూతన మండల అధ్యక్షుడిగా మండ సోమ్‌బాబు, ఉపాధ్యక్షుడిగా ఆరాధ్యుల రమేష్, గౌరవ అధ్యక్షుడిగా చింతలూరి రంగారావు, కార్యదర్శిగా సన్నిధిరాజుల రామకృష్ణ (బన్నీ), ట్రెజరర్‌గా ములగాడ రామకృష్ణ, సలహాదారులుగా యల్లమంద రవీంద్రబాబు, పల్లేటి సత్యనారాయణ, ఆరాధ్యుల నరేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.

వరద బాధితులకు నిత్యావసరాలు



వరద బాధితులకు నిత్యావసర వస్తువులను అందజేస్తున్న గాయత్రీ విద్యా సంస్థల ప్రతినిధులు

రాజానగరం: విజయవాడలోని వరద బాధితులకు కానవరంలోని గాయత్రీ విద్యా సంస్థలు కానవరం, కోరుకొండలోని తమ విద్యార్థులు, టీచింగ్ సిబ్బంది సహకారంతో సుమారు రూ.నాలుగు లక్షలు విలువ చేసే నిత్యావసర వస్తువులను వితరణ చేశారు. ఆరు వేల కిలోల బియ్యం, 500 కిలోల పంచదార, 500 కిలోల కరాచీ నూక, 500 కిలోల గోధుమ పిండి, 250 కిలోల కందిపప్పు, 250 కిలోల చింతపండు, 250 లీటర్ల నూనె, 500 టీ పొడి ప్యాకెట్లు ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్లి 500 మంది వరద బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. ఇందుకు సహకరించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, సిబ్బందికి కరస్పాండెంట్ వీవీవీఎస్ఎన్ మూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్య సహకార సంఘ దళితుల ఆందోళన

జనసేన నేత శివరామ్‌పై ఫిర్యాదు



కోరుకొండ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న నిడిగట్ల మత్స్య సహకార సంఘ నాయకులు

మధురపూడి: కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం లిమిటెడ్ సీ 76కు చెందిన దళితులు కోరుకొండ పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి ఆందోళన చేశారు. అనంతరం పోలీసులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు గొంతి లక్ష్మణరావు విలేకరులతో మాట్లాడుతూ మత్స్య సహకార సంఘానికి చెందిన శరబన్న చెరువులో శనివారం రాత్రి 80 కిలోల చేపలను చోరీ చేశారన్నారు. దీనివల్ల సంఘం నష్టపోతుందని, చోరీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జనసేన నేత మేడిశెట్టి శివరామ్ నుంచి రక్షణ కల్పించాలని పోలీసులకు వినతి పత్రం అందించామని సంఘ అధ్యక్షుడు లక్ష్మణరావు తెలిపారు. కాగా చెరువుల్లో చేపలను పట్టుకుంటాం.. దిక్కున్నచోట చెప్పుకోండి, మీరెంతంటూ శివరామ్ దుయ్యబట్టినట్టు వివరించారు. అంతేగాక చెరువులు లేకుండా చేస్తానని బెదిరించారన్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తుల నుంచి 15 కిలోల చేపలను మాత్రమే స్వాధీనం చేసుకున్నామన్నారు. జనసేన నేత శివరామ్ అండతో చేపల చోరీలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనిపై ఎస్సై శ్యామ్ సుందరం స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు కొల్లాటి అబ్బులు, సంఘం ఉపాధ్యక్షుడు దారా వరప్రసాద్, నాయకులు మానేపల్లి జార్జి బెన్నీ, యాళ్ల రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వాటాల ఉపసంహరణ ఆలోచన విరమించుకోవాలి

- సౌత్‌సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్
- ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



రాజమండ్రి డివిజన్ నూతన కార్యవర్గంతో రవీంద్రనాథ్, సతీష్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వానికి ఏటా డివిడెంట్ రూపంలో వేల కోట్ల రూపాయలు ఇస్తున్నా, లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడిగా సమకూర్చుతున్న ప్రభుత్వ రంగ ఎల్ఐసీలో ప్రభుత్వ వాటాల ఉపసంహరణ ఆలోచన విరమించుకోవాలని సౌత్‌సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి టీవీఎస్ఎస్ రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం స్థానిక మోడల్ కాలనీలో ఎల్ఐసీ ఉద్యోగుల భవనంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్(ఐసీఈయూ) రాజమండ్రి డివిజన్ 27వ వార్షిక సర్వ సభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పి.సతీష్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని, ఎల్ఐసీ ప్రీమియంపై విధిస్తున్న జీఎస్టీని తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ రాజమండ్రి డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్, పీఅండ్ ఐ ఆర్ మేనేజర్, క్లాస్-1 ఆఫీసర్స్ ఫెడరేషన్ నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, ఏజెంట్స్ అసోసియేషన్, సీఐటీయూ నాయకులు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు తదితరులు హాజరయ్యారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ నూతన కార్యవర్గానికి సౌత్‌సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి రవీంద్రనాథ్ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా ఎస్ఆర్‌జే మాథ్యూస్, ఉపాధ్యక్షులుగా ఐవీ సుధాకర్, జి.శ్రీనివాసరావు, సీహెచ్ సత్యదేవ, ప్రధాన కార్యదర్శిగా ఎం.కోదండరామ్, జాయింట్ సెక్రటరీలుగా పీఎస్ఎన్ రాజు, ఎ.సుబ్బారావు, ఎం.రామకృష్ణ, కోశాధికారిగా వి.ఈశ్వరరావులను ఎన్నుకున్నారు.